క్లుప్తంగా

పనిగంటల పెంపు దారుణం

కొల్లిపర: శాసనసభ ఆమోదించిన పనిగంటల పెంపు చట్టాన్ని వ్యతిరేకిస్తూ కొల్లిపర పంచాయతీ కార్మికులు బుధవారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకుడు ములక శివసాంబిరెడ్డి మాట్లాడుతూ పెట్టుబడిదారుల ప్రయోజనాల కోసం కార్మికుల శ్రమని మరింత దోపిడీ చేయడం కోసం చట్టం చేశారని కార్మిక వర్గం ఇలాంటి విధానాలను తిప్పి కొట్టాలని కోరారు. సీపీఎం జిల్లా నాయకుడు ఎస్.భావన్నారాయణ, కార్మికులు జి.సుందర్రావు, ఎం.రమేష్, దీనమ్మ, సుజాత, మరియమ్మ, ఏసుపాదం, పిచ్చయ్య, కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సేవా దృక్పథం కలిగి ఉండండి



తెనాలిఅర్బన్: విద్యతో పాటు సేవా దృక్పథాన్ని కలిగి ఉండాలని అధ్యాపకులు డాక్టర్ సాంబశివుడు పేర్కొన్నారు. ఎస్ఎస్ఎస్ దినోత్సవాన్ని జేఎంజే మహిళా కళాశాలలో బుధవారం నిర్వహించారు. ఈసందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్ఎస్ఎస్ దినోత్సవాన్ని ప్రతి ఏడాది సెప్టెంబర్ 24న నిర్వహిస్తామని తెలిపారు. అధ్యాపకులు డాక్టర్ జి.జ్యోతి ఓలివియా మాట్లాడుతూ సమాజ శ్రేయస్సుకు మన వంతు కృషి చేయాలన్నారు. అనంతరం వ్యాసరచన పోటీలలో గెలుపొందిన విద్యార్థినులకు బహుమతులు ప్రదానం చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సిస్టర్ శాంత, వైస్ ప్రిన్సిపాల్ సిస్టర్ రోజలిన్, ఎన్ఎస్ఎస్ ఆఫీసర్ డాక్టర్ దాసరి విజయలక్ష్మి, పీడీ డాక్టర్ అరుణ సుజాత, అధ్యాపకులు డాక్టర్ పి.జెన్నమ్మ, విద్యార్థినులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య పనుల పరిశీలన



తెనాలిటౌన్: రూరల్ మండలం నందివెలుగు, కొలకలూరు గ్రామాల్లో జరుగుతున్న పారిశుద్ధ్య పనులను తెనాలి ఎంపీడీవో అత్తోట దీప్తి బుధవారం పరిశీలించారు. తరచూ కురుస్తున్న వర్షాల కారణంగా రోడ్లవెంట నిలిచివున్న వర్షపు నీటిని గుర్తించి, బయటకు పంపేలా చర్యలు తీసుకోవాలని పంచాయతీ కార్యదర్శులను ఆదేశించారు. ప్రతిరోజూ మురుగు కాల్వలను శుభ్రంచేసి నీరు సక్రమంగా పారుదల అయ్యేలా చూడాలని సూచించారు. నీటి నిల్వలు లేకుండా చూస్తూ, అవసరమైనచోట బ్లీచింగ్ చల్లించాలని చెప్పారు. ఎంపీడీవోతో నందివెలుగు పంచాయతీ కార్యదర్శి హేమకుమారి, కొలకలూరు పంచాయతీ కార్యదర్శి కరిముల్లా, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

చీరలు పంపిణీ



తెనాలిఅర్బన్: దసరా పండుగను పురస్కరించుకుని సాయి మంగా వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో బుధవారం రామలింగేశ్వరపేటలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాలలో పేద మహిళలకు చీరలను తహశీల్దార్ గోపాలకృష్ణ పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘ అధ్యక్షుడు జొన్నాదుల వెంకటేశ్వరరావు, సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు రమేష్ బాబు, సుధాకర్, కాకుమాను ఉమాశంకర్, రామకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో బాలుడికి తీవ్ర గాయాలు

తెనాలిరూరల్: విద్యుదాఘాతంతో బాలుడు తీవ్ర గాయాలపాలైన ఘటన తెనాలిలో చోటుచేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం పట్టణ సుల్తానాబాద్ సుందరయ్యనగర్‌కు చెందిన బ్లెస్సింగ్ పాల్(9) మంగళవారం రాత్రి ఇంటి వద్ద ఆడుకుంటుండగా ప్రమాదవశాత్తు తెగి పడి ఉన్న 11 కేవీ హైటెన్షన్ విద్యుత్ తీగలను పట్టుకున్నాడు. దీంతో బాలుడికి తీవ్ర గాయాలవగా తల్లిదండ్రులు మంగళగిరి ఎయిమ్స్‌కు తీసుకెళ్లగా మెరుగైన చికిత్స కోసం గుంటూరులోని ప్రైవేటు వైద్యశాలకు తరలించారు. ప్రస్తుతం బాలుడి పరిస్థితి విషమంగా ఉన్నట్టు తెలిసింది.

గుర్తుతెలియని వృద్ధుడు మృతి



తెనాలిరూరల్: తెనాలి రైల్వే స్టేషన్ వద్ద గుర్తు తెలియని వృద్ధుడి మృతదేహాన్ని స్థానికులు బుధవారం సాయంత్రం గుర్తించారు. మృతుడి వయసు సుమారు 70 ఏళ్లు ఉంటుంది. మాసిన గడ్డంతో తెల్ల చొక్కా, నీలం గళ్ల లుంగీ ధరించి ఉన్నాడు. పట్టణానికి చెందిన శ్రీ శివలింగేశ్వరస్వామి భక్త బృంద సేవా సమితి సభ్యులు సమాచారం తెలుసుకుని మృతదేహాన్ని పోలీసుల సమక్షంలో తెనాలి వైద్యశాలలోని మార్చురీకి తరలించారు.

పారిశుద్ధ్యం మూలన..

జనం జ్వరాల బారిన!





కొలకలూరు బీసీ కాలనీలో రోడ్లపై చెరువును తలపిస్తున్న వర్షం నీరు

- ఇంటింటా ప్రబలుతున్న విషజ్వరాలు
- పల్లెల్లో లోపభూయిష్టంగా శానిటేషన్ నిర్వహణ
- పట్టించుకోని కూటమి ప్రభుత్వం

తెనాలిటౌన్: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకవేసింది. ఖాళీ స్థలాల్లో వర్షం నీరు చేరడం వలన దోమలు వృద్ధి చెందుతున్నాయి. పల్లెలు, కాలనీలు, పలు లోతట్టు ప్రాంతాలు జలమయమై ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. కాల్వల్లో పేరుకుపోయిన మురుగునీరు, చెత్త చెదారం వలన దోమలు వ్యాప్తి చెందుతున్నాయి. దీంతో ప్రజలు జలుబు, దగ్గు, జ్వరం వంటి సీజనల్ వ్యాధుల బారినపడి ఆసుపత్రుల పాలవుతున్నారు. జిల్లాలో డయేరియా, డెంగీ, మలేరియా, టైఫాయిడ్, కలరా కేసులు అధికంగా ఉన్నాయి. తెనాలి మండలంలో టైఫాయిడ్ కేసులు అధికంగా నమోదవుతున్నాయి.

పారిశుద్ధ్యం అధ్వానం..

గ్రామాల్లో పారిశుద్ధ్యం అధ్వానంగా ఉండటం వలన దోమలవ్యాప్తి అధికమై ప్రజలు రోగాల బారినపడుతున్నారు. పల్లెల్లో శానిటేషన్ నిర్వహణ లోపభూయిష్టంగా ఉంది. సిబ్బంది కొరత స్పష్టంగా కనబడుతుంది. మండలవ్యాప్తంగా కనీసం 200 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉండాల్సి ఉంటే కేవలం 100 నుంచి 112 మందితో సరిపెడుతున్నారు. దాదాపు వీరిలో కాంట్రాక్ట్ కార్మికులు అధికంగా ఉన్నారు. వీరికి జీతభత్యాలు సకాలంలో ఇవ్వడంలో పంచాయతీ అధికారులు తీవ్ర తాత్సారం చేస్తున్నారు. ఇందువలన కార్మికులు సరిగా పనిలోకి రావడం లేదని ఆరోపణలు వినిపిస్తున్నాయి. గతంలో రోడ్ల వెంబడి బ్లీచింగ్ చల్లడం, ఫాగింగ్ చేయడం, ప్రతి రోజు మురుగు కాల్వలు తీయించడం, ఖాళీ స్థలాల్లో పిచ్చి మొక్కలు తొలగించడం, వర్షపు నీటిని గుంటల నుంచి బయటకు పంపడం వంటి చర్యలు చేపట్టే వారు. అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో నిర్లక్ష్యం నిలువెల్లా కనిపిస్తుంది. వెరసి పారిశుద్ధ్య నిర్వహణ లోపభూయిష్టంగా మారింది.

పనిచేయని 'మ్యాజిక్'

ముఖ్యంగా కొలకలూరు బీసీ కాలనీలో అంతర్గత రహదారులు, డ్రైయిన్లు లేకపోవడం వలన కాలనీ వర్షాలకు నీటమునిగి ఆ ప్రాంత ప్రజలు దుర్భర జీవితం గడుపుతున్నారు. ఇటీవల మంత్రి మనోహర్ కాలనీలో పర్యటించి మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి పూనుకున్నారు. అయితే అధిక వర్షాలకు ఆ ప్రాజెక్టుకు ఆదిలోనే అరిష్టాలు తోడయ్యాయి. నిర్మాణం చేసిన డ్రైయిన్‌లలో నీరు నిలిచి బయటకు పోకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బంది పడుతున్నారు. మ్యాజిక్ డ్రైయిన్లు మాకు వద్దంటూ ఆందోళన చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పల్లెలు, లోతట్టు ప్రాంతాల్లో సమగ్ర శానిటేషన్ చర్యలు చేపట్టాలని, ప్రబలుతున్న విషజ్వరాలకు అడ్డుకట్ట వేయాలని ప్రజలు కోరుతున్నారు.

తీవ్ర అనారోగ్య పరిస్థితులు ఎదుర్కొంటున్నాం..



గ్రామంలోని బీసీ కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైయిన్లు నిర్మాణం చేయాలని అనేకమార్లు అధికారులకు అర్జీలు ఇచ్చాం. పట్టించుకున్న అధికారిగాని, ప్రజాప్రతినిధి గాని లేరు. ఇటీవల మంత్రి మనోహర్ కాలనీలో పర్యటించి మ్యాజిక్ డ్రైయిన్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. అయినా ఫలితం లేదు. పరిస్థితిని సమీక్షించి సిమెంటు రోడ్లు, సైడ్ డ్రైయిన్లు నిర్మించాలి. ఇప్పటికే తీవ్ర అనారోగ్య పరిస్థితులను ఎదుర్కొంటున్నాం.

– మణికంఠ, బీసీకాలనీ, కొలకలూరు

క్యాంపులను సద్వినియోగం చేసుకోవాలి



మండల పరిధిలోని అన్ని గ్రామాల్లో మెడికల్ క్యాంపులు కండెక్ట్ చేస్తున్నాం. ఆరోగ్య సిబ్బంది ప్రతి రోజు ఇంటింటికి వెళ్లి ఫీవర్ సర్వే నిర్వహిస్తున్నారు. తీవ్రమైన జ్వరం, జలుబు, దగ్గు వంటి లక్షణాలు ఉంటే స్థానిక పీహెచ్‌సీలకు గానీ, తెనాలి జిల్లా ప్రభుత్వ వైద్యశాలకు గాని వెళ్లి ఆరోగ్యపరీక్షలు చేయించుకోవాలి. సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి. గ్రామాల్లో నిర్వహిస్తున్న మెడికల్ క్యాంపులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ సీహెచ్‌వీ సుబ్బారావు, వైద్యాధికారి, కొలకలూరు పీహెచ్‌సీ

పారిశుద్ధ్య చర్యలు తీసుకుంటున్నాం



గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగుపడేలా చర్యలు తీసుకుంటున్నాం. ప్రతిరోజు మురుగు కాల్వలు శుభ్రం చేయించడం, రోడ్ల వెంబడి చెత్తచెదారం తొలగించడం, కాల్వల్లో దోమల నిర్మూలనకు ఫాగింగ్ చేయిస్తున్నాం. ప్రజలు ఆరోగ్య జాగ్రత్తలు పాటించి అధిక వర్షాలకు సంభవించే సీజనల్ వ్యాధుల పట్ల అప్రమత్తంగా ఉండాలి.

– అత్తోట దీప్తి, ఎంపీడీఓ, తెనాలి మండలం

వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి



తెనాలిఅర్బన్: వ్యాధులు ప్రబలకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ పేర్కొన్నారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం ఏఎన్ఎంలు, ఇంజినీరింగ్ అధికారులతో ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో కలరా ప్రబలుతున్నట్లు సమాచారం ఉందన్నారు. దీనికి ప్రధాన కారణం కలుషిత ఆహారం, నీరేనని చెప్పారు. రక్షిత మంచినీటి పైప్‌లైన్‌లు ఎక్కడ లీకులు లేకుండా చూడాలన్నారు. ఎక్కడైన లీక్‌లు ఉన్నట్లు గుర్తిస్తే వెంటనే ఇంజినీరింగ్ అధికారులకు తెలియజేసి వాటికి మరమ్మతులు చేయించాలని సూచించారు. ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు మాట్లాడుతూ పట్టణంలో వ్యాధులపై సర్వే చేయాలని సూచించారు. కాచి చల్లార్చిన నీరు ప్రజలు తాగే విధంగా చూడాలన్నారు. అలాగే వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. డీఈలు ఆకుల శ్రీనివాసరావు, శ్రీనివాసులు, ఏఈలు, సచివాలయ ఎమినిటీ సెక్రటరీలు, ఏఎన్ఎంలు, సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలను టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయండి..

తెనాలిఅర్బన్: తెనాలి పట్టణంలో ప్రజలకు ఎదుర్కొనే సమస్యలను టోల్ ఫ్రీ నెంబర్ 18004256468కు తెలియజేయాలని మున్సిపల్ ఇన్‌చార్జి కమిషనర్ పి.శ్రీకాంత్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెనాలి పట్టణంలో పంపిణీ చేసే రక్షిత మంచినీటి సరఫరాలలో ఏవైనా ఇబ్బందులు ఏర్పడిన, రంగు మారిన నీరు వచ్చిన వెంటనే తమకు టోల్‌ఫ్రీ నెంబర్‌కు తెలియజేయాలన్నారు.



దేవీచౌక్‌లో శ్రీఅన్నపూర్ణాదేవిగా..



మారీసుపేటలో గాయత్రిదేవిగా..



రామలింగేశ్వరపేట శివాలయంలో ..



శివాజీచౌక్‌లో శ్రీఅన్నపూర్ణాదేవిగా..

మాతా అన్నపూర్ణేశ్వరీ..!

దేవీ శరన్నవరాత్రి మహోత్సవాలతో పట్టణంలోని దేవాలయాలు కళకళలాడుతున్నాయి. రాత్రిళ్లు విద్యుత్ వెలుగులతో శోభిల్లుతున్నాయి. పండగ అలంకారాలతో దర్శనమిస్తున్న అమ్మవారి రూపాలను భక్తులు భక్తిశ్రద్ధలతో దర్శించుకుంటున్నారు. అమ్మవారు బుధవారం శ్రీ అన్నపూర్ణాదేవిగా భక్తులకు దర్శనమిచ్చారు. – తెనాలి/తెనాలిటౌన్



సుల్తానాబాద్‌లో అన్నపూర్ణాదేవిగా..



బోసురోడ్డులోని శ్రీవాసవి అమ్మవారికి శ్రీఅన్నపూర్ణాదేవి అలంకారం



కఠెవరంలో శ్రీఅన్నపూర్ణాదేవిగా శ్రీదుర్గామల్లేశ్వరి



నందివెలుగులో గాయత్రీదేవిగా శ్రీదుర్గాదేవి



వైఎస్సార్ సీపీ విస్తృతస్థాయి సమావేశం బుధవారం ఉదయం తాడేపల్లిలోని పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించారు. వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన సమావేశంలో పార్టీ తెనాలి నియోజకవర్గ సమన్వయకర్త అన్నాబత్తుని శివకుమార్ పాల్గొన్నారు. – సాక్షి నెట్‌వర్క్

ప్రకృతి వ్యవసాయ క్షేత్రాల పరిశీలన



కొల్లిపర: మండలంలోని దావులూరిపాలెం, బొమ్మువానిపాలెం గ్రామాల్లో పకృతి వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడంలో భాగంగా రైతు సాధికార సంస్థ, ఆంధ్రప్రదేశ్ ప్రజా భాగస్వామ్య పకృతి వ్యవసాయం ఆధ్వర్యంలో బుధవారం పాలసీ డ్రాఫ్టింగ్ ఎక్స్‌పర్ట్ టీమ్ ప్రకృతి వ్యవసాయ క్షేత్రాలను సందర్శించి, బృందం సభ్యులు ఏటీఎం, ఏ–గ్రేడ్, సూర్యమండలం, పీఎండీఎస్, బయో రిసోర్స్ సెంటర్లలను సందర్శించి, బీజామృతం, ద్రవ, ఘన జీవామృతాల తయారీ విధానాలను రైతుల పంట పొలంలో ప్రత్యక్షంగా తెలుసుకున్నారు. హెల్త్ అండ్ న్యూట్రిషన్‌పై పకృతి వ్యవసాయ రైతులు ఎటువంటి ఆహార ఉత్పత్తులు పండిస్తున్నారన్న అంశాలను అడిగితెలుసుకుని, సాగు చేస్తున్న పంటలను పరిశీలించారు. అనంతరం తెనాలి మండలంలోని ఎరుకులపూడి గ్రామంలో పకృతి వ్యవసాయంలో సాగు చేస్తున్న పది ఎకరాల వరి కాంపాక్ట్ బ్లాక్‌ను, గట్టులపై సాగు చేస్తున్న బండ్ మోడల్ ను పరిశీలించారు. తొలుత బృందం సభ్యులు జిల్లా స్థాయిలోని పకృతి వ్యవసాయశాఖ అధికారులతో, సిబ్బందితో సమావేశమై జిల్లాలో ఇప్పటి వరకు పకృతి వ్యవసాయంలో చేపట్టిన కార్యక్రమాలను గురించి తెలుసుకున్నారు. పాలసీ డ్రాఫ్టింగ్ ఎక్స్‌పర్ట్ టీమ్ నుంచి నాబార్డ్ చీఫ్ జనరల్ మేనేజర్ వెంకటేష్ టగత్, నాబార్డ్ డీఎం డి.సూర్య కుమార్, రూరల్ డెవలప్‌మెంట్ ఎక్స్‌పర్ట్ సంజీవ్‌గుప్త, ఏపీసీఎన్ఎఫ్ జిల్లా యాంకర్ గోపి చంద్, ఆర్‌వైఎస్ఎస్ టీమ్ కిషోర్, అదనపు జిల్లా ప్రాజెక్ట్ మేనేజర్ సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్లు లేక జగనన్న కాలనీ వాసుల ఇక్కట్లు



గుడిబండివారిపాలెం జగనన్న కాలనీలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న సీపీఎం నేతలు

కొల్లిపర: మండలంలోని గుడిబండివారిపాలెంలోని జగనన్న కాలనీలో రోడ్డు లేక పోవటంవల్ల గృహాలు నిర్మించుకున్న లబ్ధిదారులు వర్షాల వలన రోడ్డు లేక పోవటంతో కాలనీల్లో నుంచి బయటకు రావటానికి అనేక బాధలు పడుతున్నారని సీపీఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు ఎస్.భావన్నారాయణ పేర్కొన్నారు. బుధవారం సీపీఎం నాయకులు గుడిబండివారిపాలెంలోని జగనన్న కాలనీ పరిశీలించి ప్రజలు సమస్యలను అడిగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పంట పొలంలో కాలనీ ఏర్పాటు చేయటం వలన కనీసం దారి గ్రావెల్‌తో కూడా ఎటువంటి రహదారులు నిర్మించక పోవటంతో వర్షం వచ్చినప్పుడల్లా కాలనీ నీట మునిగి, మురుగు పారుదల లేకపోవటంతో పాటు ఎక్కువ రోజులు నీరు ఉండటం వలన పాములు, దోమలు ఎక్కువగా ఉంటుంటాయని కాలనీవాసులు తమ దృష్టికి తీసుకురావటం జరిగిందన్నారు. అధికారులు స్పందించి పూర్తిస్థాయిలో రోడ్ల నిర్మాణాలు చేపట్టాలని డిమాండ్ చేశారు. సీపీఎం తెనాలి ఏరియా నాయకుడు ములకా శివసాంబిరెడ్డి, కాలనీ వాసులు పాల్గొన్నారు.

ఆంధ్రా ప్యారిస్ 'మున్సిపల్' అసోసియేషన్ ఎన్నిక



నూతన కార్యవర్గ సభ్యులను అభినందిస్తున్న మేనేజర్ జయకర్, ఆర్ఓ రాంప్రసాద్

తెనాలిఅర్బన్: ఆంధ్రా ప్యారీస్ మున్సిపల్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ఉమాశంకర్, ప్రధాన కార్యదర్శిగా టి.నూసన్‌లు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మున్సిపల్ కార్యాలయంలోని కౌన్సిల్ హాల్‌లో బుధవారం సాయంత్రం కార్యవర్గ సమావేశం నిర్వహించారు. ఎన్నికల అధికారులుగా మేనేజర్ జడ్ విల్సన్ జయకర్, ఆర్ఓ రాంప్రసాద్‌లు వ్యవహరించారు. ఉపాధ్యక్షులుగా ఎం.సాంబశివరావు, టీపీఎస్ఎస్ ప్రసాద్, కోశాధికారిగా ఎండీ బాబాతాజుద్దీన్, సంయుక్త కార్యదర్శులుగా పి.జోసఫ్, వి.వాణిశ్రీలు ఎన్నికైనట్లు ఎన్నికల అధికారులు తెలిపారు. నూతనంగా ఎన్నికైన వారిని అభినందించి సన్మానించారు. వివిధ విభాగాల అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.

రోడ్ల వెంట పిచ్చి మొక్కలు తొలగించండి

తెనాలిఅర్బన్: రోడ్ల వెంట ఉన్న పిచ్చి మొక్కలను తొలగించాలని మున్సిపల్ ఆరోగ్యాధికారి డాక్టర్ మొవ్వా యేసుబాబు పేర్కొన్నారు. స్వచ్ఛతా హి సేవా కార్యక్రమంలో భాగంగా తెనాలి నుంచి విజయవాడ వెళ్లే ప్రధాన రహదారి వెంట ఉన్న పిచ్చి మొక్కలను బుధవారం మున్సిపల్ సిబ్బంది తొలగించారు. అలాగే 31, 40 వార్డులలోని మురుగు కాల్వలో పూడికతీత పనులను ఆయన పరిశీలించారు. కార్యక్రమంలో శానిటరి ఇన్‌స్పెక్టర్‌లు దావులూరి శ్రీనివాసరావు, లక్ష్మీనారాయణ, సిబ్బంది పాల్గొన్నారు.

గ్రంథాలయ అభివృద్ధికి కృషి

ఫిరంగిపురం: గ్రంథాలయ అభివృద్ధికి కృషి చేయాలని జిల్లా గ్రంథాలయ సంస్థ కార్యదర్శి వి.సుబ్బరత్నమ్మ అన్నారు. మండలకేంద్రంలోని గాలిబాలి శాఖ గ్రంథాలయాన్ని బుధవారం పరిశీలించారు. కొన్ని ప్రాంతాల్లో భవనం దెబ్బతిని ఉండటాన్ని గమనించారు. మరమ్మతులు చేయించాలని గ్రంథాలయాధికారి వెంకట దుర్గారెడ్డిని ఆదేశించారు. గ్రంథాలయంలోని పుస్తకాలను, రికార్డులను, రిజిస్టార్లను ఆమె పరిశీలించి, పాఠకులతో కొద్ది సేపు మాట్లాడారు. పాఠకులకు కావల్సిన పుస్తకాల వివరాలు అడిగితెలుసుకున్నారు. వాటిని తెప్పించేందుకు ప్రయత్నించాలని చెప్పారు. ఆమె వెంట రాష్ట్రగ్రంథాలయ పరిషత్ మెంబర్ ఎం.పద్మజా, గ్రంథాలయ సిబ్బంది ఉన్నారు.

వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ కమిటీ



మాజీ ఎమ్మెల్యే శివకుమార్‌తో అధ్యక్షుడు పెదలంక వెంకటేశ్వర్లు, ఇతర కార్యవర్గం

తెనాలి: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ తెనాలి సమన్వయకర్త, మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అనుమతితో తెనాలి పట్టణ బీసీ అనుబంధ విభాగం కార్యవర్గాన్ని ఆ విభాగం అధ్యక్షుడు పెదలంక వెంకటేశ్వరరావు ప్రకటించారు. కార్యవర్గంతో సహా మాజీ ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్‌ను కలిసి పరిచయం చేశారు. వైఎస్సార్ సీపీ పట్టణ బీసీ విభాగం ఉపాధ్యక్షులుగా మల్లెబోయిన బాజీ, తాడిబోయిన వెంకటకృష్ణ, ప్రధాన కార్యదర్శులుగా గోడే సుబ్రహ్మణ్యం, చోటవరపు వెంకటరమణ, జొన్నాదుల శివనాగేశ్వరరావు, కార్యదర్శులుగా భరణి శ్రీనివాసరావు, మునిపల్లి వంశీ, పూనే నాగేశ్వరరావు, కాకుమాను వెంకట నాగ విమల్‌కుమార్, అలవల వెంకటరాంబాబు నియమితులయ్యారు. కార్యవర్గసభ్యులుగా మన్నవ నవీన్, తాడిబోయిన నాగరాజు, గండాబత్తుని ధనుంజయరావు, చోకల సైదులు, బేతపూడి పవన్‌కుమార్, నాగరాజు చైతన్యరాజు, గాజులపల్లి ఆంజనేయులు, బల్లేపల్లి దుర్గాప్రసాద్, తోట దుర్గాప్రసాద్, గోనుగుంట్ల నారాయణ, పెదలంక రాము, పోలీ అఖిలవర్మ, యేటూరి సాంబశివరావు, కమాదుల మహేష్, ఆరాధ్యుల నరేంద్ర నియమించినట్టు వివరించారు.

అందెల సవ్వడి అలరించగా..



శివాజీచౌక్‌లోని శ్రీకాళీమాత ఆలయంలో జరుగుతున్న దేవీ శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా బుధవారం రాత్రి శ్రీకళ్యాణి ఆర్ట్స్ అకాడమీ నృత్యగురువు చల్లా బాలత్రిపురసుందరి శిష్యబృందం కూచిపూడి నృత్యాంశం ప్రదర్శన. – తెనాలి